## అబ్రహంకే బీ ఫారం ఇవ్వాలి

అలంపూర్, అక్టోబర్ 17: సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహంకే బీ ఫారం ఇవ్వాలని అలంపూర్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ అధిష్టానాన్ని కోరారు. మంగళవారం అలంపూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే అభిమాన, మద్దతు వర్గం బీఆర్ఎస్ నాయకులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మొదట్లో సీఎం కేసీఆర్ సిట్టింగులకే బీ ఫారం ఇస్తున్నట్లు ప్రకటించారని, ఇచ్చినమాట ప్రకారం అబ్రహం సారికే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ షంషాద్ ఇస్మాయిల్, ఎంపీపీ బేగం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీచుపల్లి, ఉపాధ్యక్షుడు నర్సన్‌గౌడ్, ఎంపీటీసీ రజియా, సర్పంచ్‌లు, కోఆప్షన్ మెంబర్ అల్లాబకాష్, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

## పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న ఎస్సై అశోక్‌బాబు, సర్పంచ్ రవి

ఎర్రవల్లి చౌరస్తా, అక్టోబర్ 17: పదోపటాలంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం ఎస్సై అశోక్‌బాబు, సర్పంచ్ రవి పరిశీలించారు. గదులు, విద్యుత్ సౌకర్యం గురించి ఆరా తీశారు. వీరివెంట వెంకటన్న, అంజి ఉన్నారు.

## బెల్ట్‌షాప్ నిర్వాహకులపై కేసు నమోదు

ఎర్రవల్లి చౌరస్తా, అక్టోబర్ 17: అక్రమంగా బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న వ్యక్తులపై కేసు నమోదైన ఘటన కోదండాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణదేవ కథనం ప్రకారం.. గార్లపాడు గ్రామానికి చెందిన తెలుగు వెంకటేశ్, ధర్మవరానికి చెందిన, శివరామ్ రెడ్డి వైన్స్ నుంచి మద్యం కొని తమ గ్రామంలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మంగళవారం విక్రయిస్తుండగా కోదండాపూర్ పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వారిపై కేసునమోదు చేశారు. 7.2లీటర్ల మద్యం, రూ.5,600 స్వాధీనం చేసుకున్నారు.

## అలరించిన కోలాటం



కోలాటం ఆడుతున్న మహిళా కళాకారులు

అలంపూర్,అక్టోబర్ 17: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అలంపూర్ క్షేత్రంలో మూడో రోజు ఏపీ రాష్ట్రం కర్నూలు జిల్లా సంతోష్‌నగర్, బళ్లారి చౌరస్తా కు చెందిన రెండు మహిళా కళాకారుల టీంలు జోగుళాంబ ఆలయం ముందు నృత్యా కళా రూపం, కోలాటాలు ప్రదర్శించారు. ఆలయ ఈవో పురేందర్‌కుమార్,ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, ఆలయ ముఖ్య అర్చకులు ఆనంద్ శర్మ కళాకారులు, నిర్వాహకులను అభినందించారు.

## సింహవాహనంపై శ్రీనివాసుడు

అయిజ, అక్టోబర్ 17: భక్తుల గోవింద నామస్మరణలు, భాజాభజంత్రీలు.. మేళతాళాలు, చిన్నారుల కోలాటాల నడుమ శ్రీనివాసుడు సింహవాహనంపై విహరించారు. పట్టణానికి సమీపంలోని స్వయంభూ కట్టకింద తిమ్మప్పస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3వ రోజు మంగళవారం శ్రీదేవి, భూదేవిసమేత వేంకటేశ్వరస్వామి భక్తులకు సింహవాహనంపై దర్శనమిచ్చారు. అలాగే మండలంలోని రాజాపురంలోని గుంటి రంగనాథస్వామి శ్రీదేవి, భూదేవితో పల్లకీలో ఊరేగుతూ.. భక్తులను అనుగ్రహించాడు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ఆడపిల్లలకు పెళ్లికానుక

- పేదలకు అండగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్
- ఆర్థికంగా ఆదుకుంటున్న కేసీఆర్ సర్కార్
- వివాహానికి రూ.లక్షా 116 సాయం అందజేత
- నియోజకవర్గంలో 668 కుటుంబాలకు లబ్ధి



కల్యాణలక్ష్మి చెక్కులతో మహిళలు (ఫైల్)



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం (ఫైల్)

రాజోళి, అక్టోబర్ 17: అమ్మాయి పెళ్లి భారం అనుకునే కుటుంబాలకు సీఎం కేసీఆర్ పెళ్లి కానుకతో ఆర్థిక భరోసా ఇస్తున్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేస్తూ ఇంటికి పెద్దన్న పాత్రను పోషిస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వివాహానికి రూ.1,00,116లు ఆర్థిక సాయం అందించి ఆడపిల్లల కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. మొదట ఈ పథకం 2014 అక్టోబర్ 2న ప్రవేశ పెట్టినప్పుడు రూ.51వేలు అందించే వారు. 2017 మార్చి 13న ప్రవేశపెట్టిన 2017-18 తెలంగాణ బడ్జెట్‌లో రూ.51వేలను రూ.75,116లకు పెంచారు. అనంతరం 2018 మార్చి 19 నుంచి రూ.1,00,116 లకు పెంచారు. ఈ పథకంలో లబ్ధి పొందిన వారంతా సీఎం కేసీఆర్‌ను తమ ఇంటి మనిషిగా భావిస్తున్నారు. మా బాధలు తెలిసిన మనిషని గుండె లోతుల్లోంచి చెబుతున్నారు. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుంటున్న మీకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని అంటున్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారుల్లో 155 ఎస్సీ కుటుంబాలకు, 315 బీసీ ఈబీసీ కుటుంబాలు, 171 మైనారిటీ కుటుంబాలకు రూ.6కోట్ల 68లక్షల 77వేల 488లు అందజేశారు.

***2022 మార్చి నుంచి అందజేత..***

రాజోళి మండలంలో కల్యాణలక్ష్మి పథకం ద్వారా 102మంది, షాదీ ముబారక్ పథకం ద్వారా 11మంది లబ్ధిపొందారు. అలాగే వడ్డేపల్లి మండలంలో కల్యాణలక్ష్మి ద్వారా 69మంది, షాదీ ముబారక్ ద్వారా 20 మంది, ఇటిక్యాల మండలంలో కల్యాణలక్ష్మి ద్వారా 81మంది, షాదీ ముబారక్ ద్వారా 19మంది, అయిజ మండలంలో కల్యాణలక్ష్మి ద్వారా 123 మంది, షాదీ ముబారక్ ద్వారా 50 మంది, అలంపూర్ మండలంలో కల్యాణలక్ష్మి ద్వారా 66మంది, ఉండవల్లి మండలంలో కల్యాణలక్ష్మి ద్వారా 39 మంది, షాదీ ముబారక్ ద్వారా 27మంది, మానవపాడు మండలంలో కల్యాణలక్ష్మి పథకం ద్వారా 20 మంది, షాదీ ముబారక్ పథకం ద్వారా 44మంది లబ్ధిపొందారు.

### సర్కారు సాయమే ఆదుకుంది..



నా కూతురు పెళ్లికి కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.1,00,116 చెక్కు మంజూరైంది. ఈ నగదు మా కుటుంబానికి ఎంతో ఆసరాగా నిలిచింది. అప్పులపాలు కాకుండా అన్ని పనులు చేశాము. ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఆదుకున్న సీఎం కేసీఆర్ సారుకు రుణపడి ఉంటాము.

– నీలావతమ్మ, మాన్‌దొడ్డి

### అప్పులపాలయ్యే వాళ్లం..



నా బిడ్డ పెళ్లి చేసిన తర్వాత కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.1,00,116 చెక్కు మంజూరైంది. ఈ డబ్బులతోనే బయటతీసుకున్న డబ్బులన్నీ చెల్లించాము. లేదంటే మేం అప్పులపాలయ్యే వాళ్లం. పెళ్లి ఖర్చుల గురించి ఆలోచించి, నాతో పాటు మాలాంటి వారిని ఆదుకుంటున్న కేసీఆర్ సారుకు రుణపడి ఉంటాం. ఆయనకే మా ఓటు.

– ఎం.మహేశ్వరి, రాజోళి

# అన్నపూర్ణాదేవీగా అంబాభవాని



శాంతినగర్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



అయిజ : అన్నపూర్ణాదేవి అలంకరణలో అంబాభవాని

అయిజ/వడ్డేపల్లి/రాజోళి, అక్టోబర్ 17: పట్టణంలోని కాళికాదేవి, అంబాభవాని, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. కాళికాదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరిమాత గాయత్రీదేవి, అంబాభవానిమాత అన్నపూర్ణా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. శాంతినగర్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, హోమాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశామని ఆర్యవైశ్య సంఘం, దేవస్థాన కమిటీ అధ్యక్షుడు రావూరి సురేష్ తెలిపారు. రాజోళిలోని అంబాభవాని ఆలయంలో మంగళవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు చేశారు. అనంతరం ఒడి బియ్యం అందించారు.



అమ్మవారికి ఒడి బియ్యం అందిస్తున్న భక్తులు

## పకడ్బందీగా పోలీస్ బందోబస్తు: ఎస్పీ



అయిజ పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ రితిరాజ్

అయిజ/వడ్డేపల్లి/రాజోళి, అక్టోబర్ 17: మూడు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న అయిజ మండలంలో పోలీస్ బందోబస్తు పకడ్బందీగా చేపట్టాలని ఎస్పీ రితిరాజ్ పోలీసులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ వెంకటేశ్వర్లుతోపాటు తనిఖీ చేశారు. చెక్ పోస్టుల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలన్నారు. నగదు, మద్యం, బంగారు ఆభరణాల తరలింపుపై గట్టి నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో సీఐ శివశంకర్ గౌడ్, ఎస్సైలు నరేష్‌కుమార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు. శాంతినగర్‌లోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం రాత్రి ఎస్పీ రితిరాజ్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మండలంలో లాఅండ్ ఆర్డర్ పరిస్థితులను సీఐ శివశంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. రాజోళి మండలంలోని సుంకేసుల డ్యాంపై ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఎస్పీ పరిశీలించారు. వాహనాల రాకపోకలను పర్యవేక్షించాలని, వీడియోగ్రఫీ తీసుకోవాలని ఎస్సై అబ్దుల్ ఖాదర్, సిబ్బందికి సూచించారు.

## మద్యం పట్టివేత

అలంపూర్,అక్టోబర్17:మండల పరిధిలోని ఇమాంపురంలో బెల్ట్ షాపుపై ఎస్సై రమేశ్ బృందం దాడులు చేసి, విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన 5.4లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిల్వ ఉంచిన ముర్తుజావలిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.